1993 నుండి వెలువడుతున్నది

ఎలమి : కుందాపి
(నందన : ఆశ్వయుజం)

అక్టోబరు 2012

తెలుగుజాతి పత్రిక

దసరా శుభాకాంక్షలతో

# నడుస్తున్న చరిత్ర

•నుడి •నాడు •నెనరు

15 రూ.



ఆంధ్ర ధాతుపాఠ/ధాతుమాల



'ఆంధ్ర ధాతుపాఠ/మాల' రచయిత పట్టాభిరామశాస్త్రి గారేనన్న సి.పి. బ్రౌన్ ధృవపత్రం ఇది. ఈ గ్రంథం అసలు వ్రాతప్రతి పూర్తి పాఠం ఈ సంచికలోనే మొదలు! తెలుగు మాటల వేర్లు(ధాతువుల)పై జరిగిన పరిశోధనలకు మూలగ్రంథం ఇదే!

స.వెం. రమేశ్




'రైతులేనిదే బతుకులేదు' 'చదువుకున్న యువతరం వ్యవసాయంలోకి రావాలి'
పదివేల కిలోమీటర్ల సైకిల్ యాత్రలో
తమిళనాడు తెలుగు యువకులు వసంత్, విద్యాశేఖర్

- నిర్దుష్ట భాషాప్రణాళిక నేటి అవసరం
- పెరుమాళ్లపల్లి భారతం ఆట
- బుద్ధుడు–బావరి–బాదన్‌కుర్తి
- ముత్యాలసరాలుకు మూలం ఏది
- అమెరికా మనసు నొచ్చుకుందని మన్మోహన్‌కు కోపం వచ్చింది!

వారసత్వ సంపద

# ఉనికిని కోల్పోతున్న వకుళమాత దేవాలయం



పడిపోయిన ముఖమండపం గోడ మరియు గాలిగోపురం



ఉత్తరం దిశ నుండి గాలిగోపురం



గాలిగోపురం తూర్పుదిశ నుండి



కొండ ముందు కోర్టు నోటీస్ బోర్డు

తిరుపతి వేంకటేశ్వరునిగా ప్రపంచవ్యాప్త గుర్తింపు పొందిన బాలాజీ దేవాలయం తిరుమలలో ఉంది. ఆ ఆలయం గర్భాలయం నుంచి మహామణి మండపందాకా, అన్ని హంగులతో ఉంది. నిత్య కళ్యాణం పచ్చతోరణం అన్న నానుడికి తిరుమల ఆలయం ఒకే ఒక ఉదాహరణ. క్రీ.శ. 12వ శతాబ్ది నుంచి ఇప్పటిదాకా రాజులు, మహారాజులు, చక్రవర్తులు, ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు ఆ ఆలయాన్ని దర్శించి కట్న కానుకలనందిస్తూనే ఉన్నారు. ఆలయాన్ని ఎప్పటికప్పుడు పరిరక్షిస్తూనే ఉన్నారు. ఆలయ మొదటి ప్రాకారం లోపల వెంకటేశ్వరస్వామి తల్లి వకుళమాత దేవాలయముంది. ఆలయ సముదాయంలోని మిగతా కట్టడాల మాదిరిగానే తిరుమలలోని వకుళమాత ఆలయం కూడా అపురూపంగానే ఉంటుంది.

వచ్చిన చిక్కల్లా తిరుపతి సమీపంలోని పేరూరు దగ్గరున్న వేరూరు గ్రామ పంచాయతీ పరిధిలో నున్న పాతకాలవ కొండ మీదున్న వకుళమాత దేవాలయం గురించే. పాత కాలువ సర్వే నెం. 590లోనున్న కొండపై గల వకుళమాత దేవాలయం క్రీ.శ. 16-17 శతాబ్దాల్లో నిర్మింపబడింది. గర్భాలయం, అర్ధమండపం, మహామండపం, చుట్టూ ప్రాకారం, గర్భాలయంపై విమానం, ప్రవేశ ద్వారంపై గోపురంతో అలరించిన వారసత్వ కట్టడం, ఏ కొండమీద ఉందో ఆ కొండను రాతికోసం తవ్వటాన అక్కడికి పోయే మార్గం లేక, ముళ్ల కంపలు పెరిగి ఆలనా, పాలనా లేక కునారిల్లుతున్నది. గర్భాలయంలో మూలవిరాట్టు లేకపోయినా, వెంకటేశ్వరుని తల్లి మీద గౌరవంతో తిరుమల వచ్చే భక్తులు దాదాపు 40 ఏళ్లక్రితం దాకా సందర్శించారు.

క్వారీయింగ్ వల్ల వారసత్వ కట్టడాన్ని పోగొట్టుకొంటామని కొందరు తిరుమల తిరుపతి దేవస్థానం వారికి విన్నవించగా, టి.టి.డి. పాలక మండలి 2005లో ఆ ఆలయాన్ని ఊడదీసి, అలిపిరి దగ్గరున్న శ్రీవారి పాదాల మండపం వెనుక మళ్లీ కట్టడానికి తీర్మానించింది. రెవెన్యూశాఖ 1695 నంబరు జీవో కూడా ఇచ్చింది. రక్షిత కట్టడం కాకపోయినా రాష్ట్ర పురావస్తుశాఖ 2006లో అందుకు అనుమతి కూడా ఇచ్చింది. టీటీడికి, రెవెన్యూశాఖ 2009లో గుడి చుట్టూ ఉన్న నాలుగు ఎకరాల స్థలాన్నివ్వగా, టిటిడీ ఇనుపకంచెను వేసింది. కారణాలు తెలియటంలేదు గానీ, అలిపిరి దగ్గర పునర్నిర్మాణానికి దేవస్థానం ఎందుకు పూనుకోవటంలేదో. కొడుకు మీదున్న భక్తి శ్రద్ధలు, తల్లి మీదకూడా ఉంటే బాగుంటుందని వారసత్వ ప్రేమికులంటున్నారు.

- ఈమని శివనాగిరెడ్డి, హైదరాబాదు, ఫోన్: 9848598446

సంపాదకీయం

# ప్రభుత్వం స్పష్టమైన ప్రకటనతో ముందుకురావాలి

ఈ ఏడు తెలుగుభాషా దినోత్సవం (ఆగస్టు 29) నిరసన ప్రదర్శనలతో బుసలు కొట్టింది. అప్పటి నుండీ నెలరోజులపాటు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు ఏదో ఒక రూపంలో జరిగాయి. భాష పండితులదేకాదని, ప్రజల భాషే అన్నివిధాలా ఉత్తమమైనదని వందేళ్లనాడు వ్యావహారిక భాషోద్యమాన్ని నడిపిన గిడుగు 150వ పుట్టిన దినాన నిరసనోద్యమం మొదలయింది. మాండలికాల మన్ననే తెలుగుభాష పెంపుకు రాదారి అని నినదించిన కాళోజీ పుట్టినరోజూ(సెప్టెంబరు 9), పత్రికల్లోకీ సినిమాల్లోకీ జనభాషను తెచ్చి ఆ జనమాధ్యమాలను ప్రజలకు సన్నిహితం చేసిన తాపీ ధర్మారావు జయంతీ(సెప్టెంబరు 19), వ్యావహారిక బాషోద్యమానికి తొలిపలకులు పలికి, తన సాహిత్యంతోనే తోటి కవులకు రచయితలకు దారిచూపిన గురజాడ జన్మదినమూ(సెప్టెంబరు 21), ఈ నెలలోనే. సమాజంలో కులవివక్షకు ఎదురునిలిచి మానవతా విలువలను బోధించడానికి తన సాహిత్యాన్ని ప్రజల్లోకి తెచ్చిన జాషువా పుట్టింది. (సెప్టెంబరు 28)కూడా ఈ నెలలోనే కావటం విశేషం. వీరందరూ కలిసి తెలుగుభాష గతినీ, ఉద్యమావసరాన్నీ మౌనంగానే మనకు చెప్తున్నట్లు భాషోద్యమకారులు భావించారు.

తెలుగుకోసం మీరేం చేయకుండా ఏం ముఖం పెట్టుకొని ప్రపంచ తెలుగు మహాసభల్ని నిర్వహిస్తున్నారని ప్రభుత్వాన్ని నిలదీయడంలో ఉద్యమకారులు సఫలమైనారు. జడత్వానికి మారుపేరుగా ఉండే ప్రభుత్వ నేతల్లో, బాధ్యులైన అధికారుల్లో ఎంతోకొంత చలనాన్ని కలిగించగలిగారు. శాసనమండలిలో, ఈ అంశంపై చుక్కా రామయ్యగారూ, ఉపాధ్యాయ ప్రతినిధి లక్ష్మణరావుగారూ, మరికొంతమంది సభ్యులూ ప్రభుత్వ నేతల్ని గట్టిగానే ప్రశ్నించారు. అక్టోబరు 2న గాంధీ జయంతినాడు తెలుగు అభిమానులైన ఇద్దరు పెద్దల తోడ్పాటుతో - తెలుగు భాషోద్యమ సమాఖ్య డిమాండ్లను ముఖ్యమంత్రి గారికి నేరుగా విన్నవించడం జరిగింది. ప్రభుత్వం నుండి త్వరగా స్పందన రావాలని ఉద్యమకారులు కోరుకొంటున్నారు. దాన్నిబట్టి - మున్ముందు కార్యక్రమాన్ని రూపొందించుకొంటారు.

ఉద్యమకారుల నిక్కచ్చులను(డిమాండ్లను) మొత్తంగా ప్రభుత్వం వెంటనే ఆమోదించేస్తుందన్నంత భ్రమలో ఉద్యమకారులు లేరు. రాష్ట్రంలో తెలుగుకోసం తప్పనిసరియైన అవసరాలనే వారు ప్రభుత్వం దృష్టికి తెచ్చారు.

ఒక మంత్రిత్వశాఖ ఏర్పడినంతమాత్రాన అన్నీ జరిగిపోతాయని ఎవరూ అనుకోవడం లేదు. పనికిమాలిన అధికార భాషా సంఘం వల్ల ఏమీ జరగదనీ, తెలుగు సాధికారమండలి (డెవలెప్‌మెంట్ అథారిటీ) కావాలని, అప్పుడది మంత్రిత్వశాఖ తోడ్పాటుతో తగిన ప్రణాళికలతో ముందుకు సాగితే - ఇప్పుడున్న విశ్వవిద్యాలయం, అకాడమీలతో సహా తెలుగుకు సంబంధించిన అన్ని వ్యవస్థలకూ దారీ తెన్నూ, అండదండలూ ఉంటాయనేది భాషోద్యమకారుల స్పష్టమైన అవగాహన. తమిళనాడు, కర్ణాటకలల్లో ఏం జరుగుతోందో సవివరంగా పరిశీలించి, తెలుసుకొని చేస్తున్న డిమాండు ఇది. ఈ ఏర్పాటు వల్ల రాష్ట్రంలో తెలుగు సమస్యలను విన్నవించుకోవడానికి ప్రభుత్వానికి సంబంధించిన ఒక చిరునామా ఏర్పడుతుంది. ఇంతవరకు ఎవరికి చెప్పుకోవాలో దిక్కు తెలియదు. కొందరికి ఈ లోతుపాతులు తెలియనందువల్ల అధికార భాషాసంఘం ఉండాలంటారు. ఆ సంఘమే ఒక దిష్టిబొమ్మ, ఒక కాలక్షేపపు ఏర్పాటు. దానికొక అధ్యక్షుణ్ణి కూర్చోబెట్టి ఆయనకు అధికారాల్లేని హోదా నేర్పరచి, కాలం గడపడం తప్ప ఆ సంఘం చేయగలిగిందేమీలేదు. అందుకనే కీ.శే. వావిలాల దాన్ని అజాగళస్తనం(మేకగొంతుకు వుండే చన్ను) అని ఎద్దేవ చేశారు.

తెలుగుకేదో చేశామని చెప్పుకోవడం కోసం కొన్ని వాగ్దానాల్ని ప్రభుత్వం ప్రకటించే అవకాశం ఉన్నదని తెలుస్తోంది. రెండేళ్లుగా చచ్చిపడి ఉన్న అధికారభాషా సంఘానికి ప్రాణం పొయ్యడంతో సహా కొన్ని నిర్ణయాలను ప్రకటించడానికి ప్రభుత్వం సిద్ధపడుతోందని తెలుస్తోంది. భాషోద్యమకారుల డిమాండ్లను పట్టించుకోకుండా,

సంపాదకీయం

ఏదో మొక్కుబడిగా ప్రకటనలు చేయడంవల్ల ప్రయోజనం లేకపోగా ఇంకా రెచ్చగొట్టినట్లే అవుతుంది.

సన్మానాలపైన అధికార స్థానాలపట్ల మోజుతో ఉండే పెద్దలు మన సాహిత్యరంగంలో చాలామందే ఉన్నారు. వీరందరి అండదండల్నీ సంపాదించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. ఇంతకాలానికి ప్రపంచ తెలుగు సభల్ని జరుపుతున్న పాలకులకు సహకరించాలి గాని వ్యతిరేకించడమేమిటి అని వీరు అమాయకంగా ప్రశ్నిస్తారు. కానుకల కోసం, మెప్పుకోసం ప్రభుత్వాన్ని మోసే బుద్ధి వీరిది. అందువల్ల సాహిత్యరంగంలో అభ్యుదయ, విప్లవాత్మక పంథాల్లో ఉన్నవారు ఇప్పుడు ముందడుగువేసి ప్రజల్లోకి రావలసి ఉంది.

భాషోద్యమకారులు కోరుతున్నదంతా స్పష్టంగా ఉంది. ప్రభుత్వ అధికారాన్ని కాదని తిరగబడగల శక్తి వారికి లేకపోవచ్చు. తెలుగుకోసం నిర్మాణాత్మకమైన చర్యల్ని ప్రకటిస్తేనే మీకు యీ సభల్ని నిర్వహించే నైతిక అర్హత లభిస్తుందని వారు ప్రభుత్వాన్ని హెచ్చరిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో ఉద్యమిస్తున్నారు. అన్ని రాజకీయ పక్షాలనూ - మీ గొంతులు విప్పండి, మీరేం చేస్తారో చెప్పండి, చెయ్యండి అంటున్నారు. ఒక్క తెలుగుదేశం పార్టీ మాత్రమే 9 డిమాండ్లనూ బహిరంగంగా సమర్ధించింది. రానున్న ఎన్నికల్లో తమ ఎన్నికల ప్రణాళికలో వీటిని చేరుస్తామన్నది. తక్కిన ప్రతిపక్షాల నేతల్ని కూడా కలిసి ఈ డిమాండ్లను తెలుపడం జరిగింది. వారు సానుకూలంగా మాట్లాడారేగాని, తమ పార్టీల తరపున ఇంతవరకూ స్పష్టమైన ప్రకటన ఏమీ చేయలేదు.

తెలుగు భాషోద్యమకారులకు ఒక పార్టీమీద ప్రేమగాని, మరొక పార్టీమీద ద్వేషంగాని లేవు. అన్ని రాజకీయపార్టీలూ అధికారం లక్ష్యంగా పనిచేస్తున్నవే. ప్రజలభాష అన్నివిధాలా అణగద్రొక్కబడుతున్న పరిస్థితుల్లో వారు మౌనంగా ఉండడాన్ని కొనసాగిస్తే - దీన్ని కూడా ఒక రాజకీయ అంశంగా చేసే దిశగా భాషోద్యమకారులు ముందుకుసాగాలి.

ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంలోనే ప్రభుత్వాన్ని నిలదియ్యాలని భాషోద్యమకారులు తలపెట్టడంలో ఉద్దేశ్యం స్పష్టమే. 'తెలుగు' పేరుతో ప్రపంచ మహాసభలను తలపెట్టిన ప్రభుత్వాన్నీ ఆ పేరుతో ప్రచారాన్ని పొందాలని ఆశిస్తున్న నేతలనూ నిలదియ్యడానికి ఇదే అదను అని వారి తలంపు. దురదృష్టవశాత్తు - భాషోద్యమంతో సంబంధం ఉన్న కొందరు రాజకీయ నాయకులు, సాహితీవేత్తలు, రచయితలు యీ సందర్భానికి తగినట్లు నిలబడి ఉద్యమంతో మమేకం కావాలన్న ఆలోచనను కోల్పోయారు. ప్రపంచ మహాసభల వల్ల ప్రచారం, కీర్తి, కొన్ని ఇతర ప్రయోజనాలు లభిస్తాయనే భ్రమలో ఉన్నారేమోగాని, తెలుగు పెంపుదలకు ఏమన్నా ఈసభలు ఉపయోగపడతాయా అనే సంగతిని పట్టించుకోవడంలేదు. ఇందుకు భాషోద్యమకారులు విస్మయం చెందుతున్నారు.

వెంటనే ప్రభుత్వం సానుకూలంగా స్పందించి కొన్ని ముఖ్య నిర్ణయాలను ప్రకటించకపోతే, నిరసన కొనసాగుతుంది. మహాసభలు ప్రశాంతంగా జరిగే పరిస్థితులు మాత్రం ఉండవు. ఇది ఎవరికీ మంచిది కాదు. ప్రపంచ మహాసభలు హుందాగా, ప్రయోజనకరంగా ఉండాలి. తెలుగుకోసం నిర్దిష్టచర్యలను ప్రభుత్వం ప్రకటిస్తేనే అది సాధ్యం అవుతుంది. ప్రకటించకపోతే - పట్టుదలగా ఉద్యమాన్ని కొనసాగించి, ప్రజల్ని చైతన్యవంతులను చేస్తూ, ప్రభుత్వాన్ని దోషిగా నిలబెట్టడానికి, పాలకవర్గాలను తెలుగు వ్యతిరేకులుగా నిరూపించడానికి వెనుకాడబోమని భాషోద్యమకారులు బహిరంగంగానే చెప్తున్నారు.

ఇప్పుడు నిర్ణయించుకోవలసింది ప్రభుత్వమే. వారికి ఈ అంశాల్లో సలహాలు ఇస్తున్న బాధ్యులందరికీ అన్ని విషయాలూ స్పష్టమే. ఇక ప్రభుత్వాన్నుండి నిర్ణయాలే వెలువడాలి. అన్ని పార్టీలలోనూ భాషోద్యమానికి అనుకూలంగా ఉన్నవారు తమ గొంతును వినిపించాలి. వారు మౌనంగా పట్టించుకోకుండా ఉండడమంటే తెలుగుకూ, తెలుగు భాషోద్యమకారులకూ వ్యతిరేకంగా నిలిచినట్లే అవుతుంది.

**06-10-2012**

సామల రమేష్ బాబు

**ఏ రాష్ట్రంలో ఉన్నా ఏ దేశంలో ఉన్నా తెలుగువారంతా ఒక్కటే**

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1225**

* * *

**Read other issues of Nadustunna Charitra @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Nadustunna+Charitra+Magazine&id=60**